




గద్వాలలోని టీటీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో యువకులు, గద్వాలలోని లింగంబాగ్ కాలనీలో.., అమరవాయిలో వినాయకుని పూజలో పాల్గొన్న నాయకులు

శాంతినగర్ మహాలక్ష్మి కాంప్లెక్స్‌లో..

గణనాథా.. అందుకో పూజలు

విఘ్నాలు తొలగించే వినాయకుడిని ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు రోజుకో పద్ధతిలో పూజలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ఉత్సవాలు రోజురోజుకూ మిన్నంటుతున్నాయి. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్నారు. కొన్ని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పూజల్లో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, బండ్ల జ్యోతి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు ఎల్లూరి రామ్మోహన్ పాల్గొన్నారు.

- సాక్షి, నెట్‌వర్క్

క్లుప్తంగా

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



అయిజ: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 1990–91, 1992–93 బ్యాచ్‌లకు చెందిన 7వ తరగతి విద్యార్థులు, పూర్వపు విద్యార్థులు పాఠశాల విద్యార్థినులకు క్రీడా దుస్తులను వితరణ చేశారు. కార్యక్రమంలో దాతలు భూమిక, సుధామణి, పద్మ, భువనేశ్వరి, శ్రీలత, కవిత, శ్రీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు రూపారాణి, శ్రీదేవి, సుశీలమ్మ, లక్ష్మి, విజయ్ కుమార్, మురళీధర్ రావు, లలితమ్మ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సమావేశం

అయిజ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ విడుత మండల సామాజిక తనిఖీ సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

హాస్టళ్ల తనిఖీ



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ బీసీ హాస్టల్, రామాపురంలోని ఎస్సీ హాస్టల్‌ను మండల ఇన్‌చార్జి తహసీల్దార్ వీరభద్రప్ప శుక్రవారం రాత్రి తనిఖీచేశారు. హాస్టళ్లలోని పరిసరాలు, స్టోర్ రూంల్లోని బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరకులను పరిశీలించారు. విద్యార్థులను అడిగి హాస్టల్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



శాంతినగర్: తెలుగ భాషా దినోత్సవ వేడుకలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష పితామహుడు ప్రముఖ రచయిత, సాహితీవేత్త, వ్యావహారిక భాషోద్యములు గిడుగు రామ్మూర్తి జయంతి, ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. రామ ఓబులేష్, వైస్ ప్రిన్సిపల్ సంపత్‌కుమార్, ఏడుకొండలు, రాఘవేందర్, జీవజయరాజ్ పాల్గొన్నారు.

మట్టి మిద్దె కూలి మహిళకు గాయాలు

శాంతినగర్: మట్టిమిద్దె కూలి మహిళకు గాయాలైన ఘటన వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండలమ్మకు చెందిన మట్టి మిద్దె భారీ వర్షాల కారణంగా కూలిపోయే అవకాశం ఉందని పంచాయతీ కార్యదర్శి వారం రోజుల క్రితం వారి కుటుంబాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలించారు. వర్షాలు తగ్గడంతో ఇళ్లు చేరుకున్న కొండలమ్మ శుక్రవారం ఇంట్లో నిద్రిస్తుండగా పైకప్పు దెంతెలు కూలిపోయి మట్టితో సహా మీద పడ్డాయి. ఘటనలో కొండలమ్మ కాలు విరిగింది. గమనించిన గ్రామస్తులు, కుటుంబసభ్యులు మట్టి తొలగించి చికిత్స నిమిత్తం బాధితురాలిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి కొండలమ్మకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసి, ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

లోఓల్టేజీ సమస్యకు చెక్



పూర్తి కావస్తున్న జూలెకల్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

- ప్రారంభానికి సిద్ధమవుతున్న జూలెకల్ సబ్‌స్టేషన్
- 8 గ్రామాల ప్రజలు, రైతులకు ఉపయోగం
- 'సాక్షి' వరుస కథనాలతో అధికారుల్లో కదలిక
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు, రైతులు



సబ్‌స్టేషన్‌కు 33 కేవీ లైన్ లాగుతున్న సిబ్బంది

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, రైతులకు కరెంట్ కష్టాలు తీరనున్నాయి. మండలంలోని జూలెకల్, తిమ్మాజిపల్లి, జక్కిరెడ్డిపల్లి, కొంకల, తనగల, వెంకట్రామనగర్, ఇటిక్యాల మండలం శనిగపల్లి, అయిజ మండలం కుర్వపల్లి గ్రామాల్లో తరచూ విద్యుత్ అంతరాయం, లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ విషయమై పదేళ్ల కాలంగా ప్రజాప్రతినిధులు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో ఆయా గ్రామాల ప్రజలు మొరపెట్టుకున్నారు. స్పందించిన ప్రభుత్వం 2020లో జూలెకల్ సమీపంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేసింది. 2021లో పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి మూడేళ్లుగా పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై విద్యుత్‌శాఖ జిల్లా ఉన్నతాధికారుల వివరణతో సాక్షిలో ప్రచురితమైన 'సబ్‌స్టేషన్ ప్రారంభ మెప్పుడో' కథనానికి స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు రీటెండర్ విధానంతో మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నెల రోజుల్లోనే సబ్‌స్టేషన్ పనులను చివరిదశకు తీసుకొచ్చాడు. ప్రస్తుతం స్తంభాలకు 33 కేవీ విద్యుత్ వైర్లు లాగే పనిలో నిమగ్నమయ్యారు. మరో నెల రోజుల్లో సబ్‌స్టేషన్ పనులు పూర్తిచేసి విద్యుత్‌శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు కాంట్రాక్టర్ పేర్కొన్నాడు.

వర్షం వచ్చిందంటే..



వానాకాలంలో వర్షం కురిసినా.. గాలి వీచిన కరెంట్ పోతది. నాలుగేళ్ల క్రితం సబ్ స్టేషన్ పనులు మొదలుపెట్టగా సంతోషించాం. కొన్ని రోజులకే పనులు నిలిచిపోయాయి. పోయిన నెలలో మళ్లీ పనులు మొదలుపెట్టారు. జోరుగా పనులు సాగుతున్నాయి. తొందరలోనే సబ్‌స్టేషన్ ప్రారంభమవుతుందని చెబుతున్నారు. లో ఓల్టేజీ సమస్య తీరుతుందని సంతోషంగా ఉంది.

– శేఖర్, జూలెకల్, వడ్డేపల్లి మండలం

మోటార్లు కాలిపోతున్నాయి



సమీపంలో సబ్‌స్టేషన్ లేనందున శాంతినగర్ సబ్‌స్టేషన్ నుంచి కరెంట్ సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పడుతూ తరచు మోటార్లు కాలిపోతున్నాయి. పదేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉండడంతో పంటలు ఆగమయ్యాయి. అలాగే విద్యుత్‌లైన్లు కూడా సరిచేసి సబ్‌స్టేషన్ ప్రారంభిస్తే కరెంట్ సరఫరాకు అంతరాయం ఉండదు.

– ఆంజనేయులు గౌడ్, రైతు, జూలెకల్

సెప్టెంబర్ చివరి వరకు..

జూలెకల్ సబ్‌స్టేషన్ పనులను పూర్తిచేసి సెప్టెంబర్ చివరి వరకు విద్యుత్ శాఖకు అప్పగిస్తామని కాంట్రాక్టర్ తెలిపాడు. వెంటనే సబ్‌స్టేషన్‌ను ట్రయల్ చేసి ప్రజలకు, రైతులకు అందుబాటులోకి తెస్తాం.

– సుబ్బారాయుడు, ఏఈ, విద్యుత్‌శాఖ, వడ్డేపల్లి

ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు



తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయిన వ్యక్తులతో ఎక్సైజ్ అధికారులు

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాల తండా, గువ్వలదిన్నె తూర్పుతండాలో సారా తయారీ, అమ్మకాలు కొనసాగిస్తున్నారనే సమాచారం మేరకు గద్వాల ఎక్సైజ్ శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడులో సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం ఉమిత్యాలతండాకు చెందిన ఈరన్న, వలిమానాయక్, లక్ష్మి, తూర్పుతండాకు చెందిన లక్ష్మీనాయక్, వెంకటేష్ నాయక్‌లను శుక్రవారం కేటీదొడ్డి తహసీల్దార్ హరికృష్ణ, డీటీ శివశంకర్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్, శివకృష్ణ మాట్లాడుతూ మండలంలోని ఎవరైనా సారా అమ్మినా.. రవాణా చేసినా వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో పాటు ఏడాది పాటు జైలుశిక్ష లేదా రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.

క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలి

అయిజ: క్రీడాకారులు ప్రతిరోజు సాధన చేసి, క్రీడా పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉత్తనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి ఎంపిక కోసం నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో అండర్ 14 విభాగం టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా తహసీల్దార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములు, మండల స్కూల్ గేమ్స్ కన్వీనర్ బషీర్‌అహ్మద్, కో కన్వీనర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తనూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ జ్యోతి

ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో రాణించాలి

కేటీదొడ్డి: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను ప్రతి క్రీడాకారుడు ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎం రాఘవేంద్ర సూచించారు. మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. విద్యర్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్‌గౌడ్, మోహన్‌మురళి, పాండు ఉన్నారు.

సీజ్ చేసిన ఇసుక జాడేది?

పట్టుబడిన ఒక్కో లారీకి రూ.15వేలు జరిమానాతో సరి

మానవపాడు: అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుపడ్డ ఒక్కో లారీకి రూ.15వేలు మాత్రమే జరిమానా వేసి మూడు లారీలను పోలీసులు వదిలేశారు. ఒక్కో లారీ ఇసుకను రూ.వేలకు అమ్మి సొమ్ము అక్రమార్కులు అక్రమంగా చేసుకుంటున్నారు. కానీ వాటిని పట్టుకున్న పోలీసలు మాత్రం తూతూమంత్రంగా జరిమానాలు వేసి ఎలా వదిలేస్తారని స్థానికులు మండిపడుతున్నారు. మంగళవారం రాత్రి తాడిపత్రి నుంచి హైదరాబాద్‌కు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా మానవపాడు పోలీసులు మూడు లారీలను పట్టుకున్నారు. కానీ ఇసుకను సీజ్ చేయకుండా ఒక్కొక్క లారీకి రూ.15వేల జరిమానా చొప్పున రూ.45వేలు కట్టించుకొని వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మానవపాడు మండలంలోని గోకులపాడులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాల తాకిడికి మూడు కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు ధ్వంసం అయింది. దీంతో గోకులపాడు గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. దాదాపు పట్టుపడ్డ ఇసుక లారీల యాజమానుల నుంచి రూ. 2.40లక్షల వసూలు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మను వివరణ కోరగా.. రూ. 2.40లక్షల ఇచ్చారనటంలో వాస్తవం కాదన్నారు. శుక్రవారం ఒక్కో లారీకి రూ.5వేలు మాత్రమే ఫైన్ వేశామన్నారు. ఇసుకను డంపు చేయకుండా లారీలను ఎలా వదిలేస్తారని విలేకరి ప్రశ్నించగా.. పొరపాటు జరిగిందని, మళ్లీ ఇసుక లారీలను తీసుకొచ్చి జరిమానా వేస్తామని తహసీల్దార్ తెలిపారు.



మానవపాడులో పట్టుపడ్డ ఇసుక లారీలు

రైతులకు యూరియా అందజేత



రైతువేదిక వద్ద క్యూలో నిలబడిన రైతులు

అయిజ: ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ యూరియా కొరత వలన రైతులు కొన్ని రోజుల నుంచి ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే శుక్రవారం రైతులకు సరిపడినన్నీ యూరియా బస్తాలు రావడంతో రైతులకు కొంతమేర ఊరట కలిగింది. మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద క్యూలో నిలబడిన 300 మంది రైతులు సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జనార్దన్ పర్యవేక్షణలో ఏఈఓలు, పీఏసీఎస్ సిబ్బంది రైతులకు టోకెన్లు అందజేసి, పర్మిట్లు రాసి ఇచ్చారు. అనంతరం సింగిల్ విండో కార్యాలయం వద్ద రైతుకు రెండు యూరియా బస్తాలను ఇచ్చారు. ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ బృందం విధులు నిర్వర్తించారు.

పోరాట యోధుడు 'సురవరం'

ఇటిక్యాల: విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి పోరాట యోధుడిగా ఎదిగిన నేత సురవరం సుధాకర్‌రెడ్డి అని భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి ఆశన్న అన్నారు. శుక్రవారం మండలంలోని సాతర్ల గ్రామంలో ఆ పార్టీ నాయకులతో కలిసి సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ భవిష్యత్‌లో అందరం ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్మికుల, కూలీల, కర్షకులపై జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేసి ముందుకెళ్లిన మహా నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని అన్నారు.



సురవరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కార్యక్రమంలో రవి, రంగన్న, లాజరన్న, కాశన్న, శంకరన్న, రామకృష్ణ, జయన్న, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిమజ్జనం నిర్వహించాలి



నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ రవిబాబు

ఎర్రవల్లి: అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జనం జరిగేలా చూడాలని అలంపూర్ సీఐ రవిబాబు అన్నారు. ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పుష్కరఘాట్ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రాంతాన్ని శుక్రవారం రాత్రి సీఐ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీచుపల్లి పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఇన్, అవుట్ దారుల్లో ఎక్కడ కూడా రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలుపకుండా పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో నది వద్ద భక్తులను లోనికి పంపరాదని సూచించారు. గజ ఈతగాళ్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. సీఐ వెంట ఎస్ఐ రవినాయక్, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

హామీల అమలులో విఫలం

అయిజ: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ నాయకులు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజీవ్ యువ వికాసం పథకం జిల్లాలో అమలు కావడం లేదని ఆరోపించారు. జిల్లాలోని ఆయా సామాజిక వర్గాల నుంచి మార్చి 15 నుంచి ఆగస్టు 14 వరకు 22 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



మానవపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలంగాణ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు పల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏ ఒక్కరికి రేషన్‌కార్డు అందించిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆయా జిల్లాల్లో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

శాంతినగర్: స్థానిక సీ రెడ్డి ఆస్పత్రిలో శుక్రవారం సుశీల నేత్రాలయ, హైదరాబాద్ వారి సౌజన్యంతో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 200 మంది కంటి వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వారిలో 60 మంది కంటి నరాలతో బాధపడుతున్నారని, కంటి శుక్లాలకు సంబంధించి 60 మందికి ఆపరేషన్లు నిర్వహించాల్సి ఉందన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని సుశీల నేత్రాలయ హైదరాబాద్‌కు తరలించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రాన్సి ప్రరాధన, చంద్రశేఖర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

గద్వాల: దౌదర్‌పల్లిలో గతంలో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ ప్లాట్లను కోల్పోయిన బాధిత లబ్ధిదారులకు వెంటనే న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఈమేరకు ఆయన శుక్రవారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బండల వెంకట్రాములు, రవి, వెంకటేశ్వర్‌రెడ్డి, దేవదాసు, చిత్తారికిరణ్, నర్సింహులు, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి కూడలిలో తప్పిన పెను ప్రమాదం



ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ఎర్రవల్లి కూడలిలో శుక్రవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి ఓ కార్గో కంటైనర్ కర్నూల్ వైపు వెళ్తుంది. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఎర్రవల్లి కూడలిలో వెళ్తుండగా డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం కారణంగా భారీకేడ్స్‌ను తప్పించబోయి అదుపుతప్పి కంటైనర్ ఒక్కసారిగా ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. దీంతో ఫుట్‌పాత్‌పై కూరగాయలు, ఆకుకూరలు అమ్ముతున్న మహిళలు, కొనుగోలు దారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు. దీంతో ఘటన స్థలంలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు క్రేన్ సహాయంతో కార్గో కంటైనర్‌ను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

నిర్మాణంలో మేటి భారతి సిమెంట్



గట్టులో తాపీ మేస్త్రీలకు అవగాహన కల్పిస్తున్న భారతి సిమెంట్ టెక్నికల్ అధికారి నితిన్

గట్టు: భారతీ సిమెంట్ చాలా దృఢమైనదని, ఇతర సిమెంట్లతో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని టెక్నికల్ అధికారి నితిన్ తెలిపారు. శుక్రవారం గట్టు, ఆరగిద్ద గ్రామాల్లో తాపీ మేస్త్రీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అధికారి నితిన్ మాట్లాడుతూ సిమెంట్ వ్యాపార రంగంలో తిరుగులేని సంస్థగా ఉన్న వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసినట్లు తెలిపారు. వికాట్ గ్రూప్ కంపెనీ ప్రపంచంలో 13 దేశాల్లో విస్తరించినట్లు పేర్కొన్నారు. భారతి సిమెంట్ మార్కెట్ లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. భారతి సిమెంట్ పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని తెలిపారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సూచనలు చేస్తారన్నారు. సమావేశంలో డీలర్ అంజి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.